క్లుప్తంగా

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆదోనిసెంట్రల్: ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో దాదాపు 11 కేంద్రాల్లో 2,480 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆయా పరీక్షా కేంద్రాలను డిప్యూటీ ఈఓ వెంకటరామిరెడ్డి, ఎంఈఓలు బి.శివరాములు, శ్రీనివాసులు పరిశీలించారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

కర్నూలుకి వెళ్లి పింఛన్ అందజేత



పద్మావతికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ రవికుమార్

ఆదోనిరూరల్: పెద్ద హరివాణం గ్రామానికి చెందిన హెచ్.పద్మావతి కర్నూలులోని బ్రహ్మారెడ్డి ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకుని, అక్కడే చికిత్స తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ రవికుమార్ ఆసుపత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశాడు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



మాట్లాడుతున్న దేవిశెట్టిప్రకాష్

ఆదోనిసెంట్రల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై స్థానిక పార్టీ నాయకులు పట్టణంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవిశెట్టిప్రకాష్, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప ఆధ్వర్యంలో వేర్వేరుగా సంబరాలు చేసుకుని మిఠాయిలు పంచుకున్నారు. ముదుంగా దేవిశెట్టి ప్రకాష్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా మైనార్టీ చైర్మన్ ఎంఎండీ నూర్ తదితర నాయకులు, కార్యకర్తలతో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ప్రజలకు స్వీట్లు పంచి పెట్టారు.

కురువలు రాజకీయంగా ఎదగాలి



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న కురువ సంఘం నాయకులు

మంత్రాలయం : కురువలు రాజకీయంగా ఎదగాలని కనకదాసు సంఘం నేతలు మల్లికార్జున, వీరనాగప్ప పిలుపునిచ్చారు. ఆదివారం కార్తీక మాసం పురస్కరించుకుని వనభోజనాలు చేపట్టారు. స్థానిక రాఘవేంద్ర సర్కిల్ నుంచి ఊరేగింపుగా కొండాపురం ఆంజనేయ స్వామి ఆలయం చేరుకున్నారు. అక్కడ కనకదాసు చిత్ర పటానికి, ఉసిరి చెట్టుకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉపసర్పంచ్ పరమేష్, నాయకులు జనార్దన్ రెడ్డి, శివకుమార్, గోరుకల్లు కృష్ణ స్వామి, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల విజయోత్సాహం



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

ఆదోనిఅర్బన్: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై పట్టణంలోని ఆ పార్టీ నాయకులు ఆదివారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. విట్టా రమేష్, ప్రకాష్‌జైన్, శ్రీరాములు, మలేకర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశానికి చేస్తున్న అభివృద్ధిని చూసి మూడు రాష్ట్రాల ప్రజలు గెలుపును అందించారని కొనియాడారు. స్థానిక కోట్ల కూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. లోకేష్, శ్రీనివాస్ ఆచారి, దేవేంద్ర, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కిస్తామని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 8న శుక్రవారం కూడా హుండీ సొమ్ము లెక్కింపు ఉంటుందని, రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లెక్కింపులో పాల్గొనే వారు పంచ, ఉత్తరీయం ధరించాలని కోరారు.

గడప గడపతో సమస్యలకు చెక్

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహణ
- ఆదోని పట్టణంలో 27 వార్డుల్లో పర్యటన పూర్తి
- 54 అభివృద్ధి పనులకు రూ.4.20 కోట్లు ఖర్చు



మేదర్‌గేరిలో సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు



పాత బస్టాండు సర్కిల్‌లో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం



పర్వతాపురంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం.



ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు వేసిన దృశ్యం.



ఆర్టీసీ కాలనీలో మురుగుకాలువల నిర్మిస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం నాలుగేళ్ల క్రితం వరకు చూశాం. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పాలన తీరులో సమూల మార్పులు చేపట్టింది. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం, పరిష్కారం చూపడంతో పాటు పాలనలో లోపాలు తెలుసుకొని సరిదిద్దుకోవడం, పథకాల అమలును పర్యవేక్షించడం లాంటి వాటి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలతో మాట్లాడాలని నిర్దేశించడంతో ఎమ్మెల్యేలు పర్యటించి సమస్యలను గుర్తించి అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపి, వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేయించి వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పుతున్నాయి.

నాయకులతో పాటు.. అధికారులూ..

ప్రభుత్వం అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, పార్టీ పదవులు పొందిన నాయకులు, మార్కెట్‌యార్డు చైర్మన్‌లు, మున్సిపల్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ శ్రేణులతో పాటు మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని దిశానిర్దేశం చేయడంతో స్థానికంగా వ్యక్తమయ్యే సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం చూపడానికి అవకాశం లభిస్తోంది. దీంతో సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయి.

ఆదోని మున్సిపాలిటీలో..

ఆదోని మున్సిపాలిటీలో 42 వార్డులు ఉన్నాయి. అందులో 27 వార్డుల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, చైర్మన్, పార్టీ శ్రేణులు కలియ తిరిగారు. ప్రతి గడపనూ సందర్శించి ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారం చేస్తూ ముందుకు సాగుతున్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన 150 దరఖాస్తులను విచారించి పరిష్కరించారు.

అందులో కొన్ని..

- మొత్తం 54 అభివృద్ధి పనులను రూ.4.20 కోట్లతో చేపట్టారు.
- 42 వార్డులకుగానూ 27 వార్డుల్లో పర్యటన పూర్తి చేశారు. 54 పనుల్లో 33 పనులు పూర్తయ్యాయి.

ఏడు పనులు చివరిదశలో ఉన్నాయి.

- 14 పనులు టెండర్ ప్రక్రియలో నడుస్తున్నాయి.

15 వార్డుల్లో ఇంకా పర్యటించాల్సి ఉంది.

‘అభివృద్ధే లక్ష్యం



నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ పథకాలు అందించడం అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది.గడప గడపకు మన ప్రభుత్వంతో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడం జరుగుతోంది. నిధుల కొరత లేదు. ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.20 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం నిధులను రెట్టింపు చేస్తామని చెప్పారు.

– వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే

27 వార్డులు పూర్తి చేశాం



పట్టణంలోని 27వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. ఆయా వార్డుల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరిస్తున్నాం. ఆర్థికపరమైన సమస్యలను కౌన్సిల్, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తున్నాం. చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నాం. 54 అభివృద్ధి పనులను రూ.4.20 కోట్లతో చేపట్టాం. 14 పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. త్వరలోనే సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడతాం.

– రఘునాథ్‌రెడ్డి, ఆదోని మున్సిపల్ కమిషనర్

ఓటరు జాబితా పరిశీలన



సూగూరులో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్



కోసిగిలో బీఎల్ఓలతో మాట్లాడుతున్న మంత్రాలయం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రమ

మంత్రాలయం : ఓటరు జాబితాలో తప్పులు ఉంటే ఓటర్లు సరిచేయించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ సూచించారు. ఆదివారం మండలంలోని సూగూరు గ్రామంలో పోలింగ్ బూత్‌ను సందర్శించి ఓటరు జాబితాను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండబోయే వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే మరణించిన వారి పేర్లు అభ్యంతరాలు తొలగించాలని సిబ్బందికి సూచించారు. వీఆర్వో జ్యోతి ఉన్నారు.

కౌతాళం: ఓటరుగా నమోదు చేసుకోని వారికి రెండు రోజుల పాటు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమం శని, ఆదివారల్లో చేపట్టారు. కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఫారం–6 ద్వారా మండలంలో 409మంది దరఖాస్తులు చేసుకున్నారని తహీల్దారు రామేశ్వర్ రెడ్డి తెలిపారు. అలాగే ఓటరు జాబితాలో మృతి చెందిన వారి పేర్లనున తొలగించేందుకు ఫారం–7 దరఖాస్తులు 135 వచ్చాయని, అలాగే తప్పు ఎంట్రీలు ఉన్న ఫారం–8కి సంబంధించి 63 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వీటిని పరిశీలించి ఉన్నత అధికారులకు పంపుతామని పేర్కొన్నారు.

కోసిగి: మండలంలో ఓటరు జాబితాలోని అభ్యంతరాలు, నమోదు ప్రక్రియ, మార్పులు, చేర్పులు ముమ్మరంగా చేపట్టారు. ఆదివారం రెండవ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు దరఖాస్తులు స్వీకరించారు. మండల కేంద్రంలోని పలు కేంద్రాలను మంత్రాలయం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమ ఆదివారం పర్యవేక్షించారు. తహసీల్దార్ రుద్రగౌడ మండలంలోని దుద్ది, తుంబిగనూరు, సాతనూరు, చిర్తనకల్లు, మూగలదొడ్డి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కొత్త ఓటర్లు ఫాం–6 దరఖాస్తులు 401, ఫాం–7 దరఖాస్తులు 61, ఫాం–8 దరఖాస్తులు 89 వచ్చినట్లు తెలిపారు. ఫాం–7 కింద వచ్చిన దరఖాస్తుల అభ్యంతరాలపై గ్రామాల్లో విచారణ చేసి తొలగింపు చర్యలు చేపడుతామని చెప్పారు.

నేలకోసిగిలో ఇంటింటికీ కుళాయి



ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసిన దృశ్యం

కోసిగి: మండలంలోని నేలకోసిగి గ్రామం నూతనంగా పంచాయతీగా మారింది. పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు పశువుల హనుమంతమ్మ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా గ్రామంలో 10 ఏళ్లకు పైగా తాగునీటి సమస్య గ్రామాన్ని వేధిస్తోంది. ప్రస్తుతం జలజీవన్ మిషన్ కింద సమస్యకు శాశ్వ పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టారు. పథకం కింద రూ.13.50లక్షలతో గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఉపయోగంలోని తీసుకొచ్చారు. దుద్ది రిజర్వాయర్ సమీపంలో బోర్, కోసిగిలోని మరో బోరు నుంచి తాగునీటిని ఓవర్ హెడ్ ట్యాంక్‌లోకి సరఫరా చేస్తున్నారు. పనులు వేగంగా పూర్తవడంతో త్వరలోనే ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే గ్రామంలో గడప గడప నిధులు రూ.10 లక్షలతో డ్రయినేజీ, సీసీ రోడ్డు పనులు చేపట్టారు.

ఉపాధ్యాయులను వేధించొద్దు



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోనిసెంట్రల్: చిన్నచిన్న కారణాలు చూపి విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్నారని ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్‌బాబు, జిల్లా కౌన్సిలర్ యం.సి.సుంకన్న ఆరోపించారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ మండలస్థాయి సమావేశాన్ని సీనియర్ నాయకులు బి.గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాట్సాప్‌లో విద్యార్థుల నోట్స్ ఉన్నతాధికారులు పరిశీలించండని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యాశాఖ అధికారులు సమీక్షల పేరుతో ఉపాధ్యాలను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఎస్టీయూ మండలాధ్యక్షుడు రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్ రామాంజనేయులు, సీనియర్ నాయకుడు బి.మహాదేవప్ప పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

ఆలూరు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం నిరంతరాయంగా కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన ద్వారా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ కేంద్రాలతో పాటు లబ్ధిదారులకు అందించిన సంక్షేమ లబ్ధిపై ప్రచారం చేసి జగనన్నకు మద్దతుగా నిలిచేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా బోగస్ ఓటర్లు, డబుల్ ఎంట్రీలపై టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండి వాటిని తిప్పికొట్టాలని సూచించారు.

వరిగడ్డికి డిమాండ్



ట్రాక్టర్‌లో వరిగడ్డిని తరలిస్తున్న దృశ్యం

హొళగుంద: వర్షాభావ పరిస్థితులు, అతివృష్టి కారణంగా పశువుల మేతకు గ్రాసం కొరత ఏర్పడడంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఎకరా వరిగడ్డి రూ.2 వేల వరకు ఉండగ ట్రాక్టర్ గడ్డి రూ.3,500 నుంచి రూ.4,500 వరకు పలుకుతోంది. కొనుగోలు చేసి తీసుకొచ్చేందుకు ఖర్చులు కలిపి దాదాపు రూ.10 వేల వరకు పెట్టుకోవాల్సి వస్తోంది. ఇతర జిల్లాలకు చెందిన రైతులు కూడా ఇక్కడికి వచ్చి గడ్డిని తీసుకెళ్తున్నారు. వీరికి ఖర్చు మరింత పెరుగుతుంది. ఈ నెల 10వ తేదీ ఎల్లెల్సీకి నీటి సరఫరా నిలిచి పోనుండడం, రబీ (వేసవి)కి సాగు నీరు లేక పోవడంతో వరిసాగు జరగదు. దీంతో మున్ముందు పశుగ్రాసం కొరత ఏర్పడితే కష్టమని భావించి ఇప్పటి నుంచే రైతులు గడ్డిని కొని నిల్వ చేసుకుంటున్నారు. ఇంతకుముందు కర్ణాటక నుంచి రైతులు గడ్డిని కొని తీసుకెళ్తుండగా ఈ ఏడాది అక్కడ కూడా ఇదే సమస్య ఉండడంతో డిమాండ్ పెరిగింది. గతంలో గడ్డిని అమ్మే రైతులు కూడా ఈ ఏడాది అమ్మకుండా తామే నిల్వ చేసుకుంటున్నారు. పొలాలు లేని వారు పశువుల మేత ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



భూ హక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పక్కన సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోనిరూరల్: రైతులకు అండగా నిలిచి రైతు ప్రభుత్వంగా తమ ప్రభుత్వం ఖ్యాతి గాంచిందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ హాల్‌లో అసైన్డ్ వ్యవసాయ భూముల పట్టాలు, ఇనామ్, ఎల్‌పీఎస్ రుణవిముక్తి పత్రాలు, వ్యవసాయ స్వేచ్ఛ సంపూర్ణ భూమి హక్కుల పత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. భూసార పరీక్షల నుంచి దిగుబడిని విక్రయించుకునేంత వరకు చేదోడు ఉంటుండటాన్ని వివరించారు. అలాగే పంటల సాగుకు పెట్టుబడి సాయం అందజేస్తూ వారికి ఆర్థిక కష్టాలను తప్పిస్తోందని చెప్పారు. ఇక రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులకు సంబంధించి అవస్థలు తొలగించింది. అలాగే పంటల సాగులో నిత్యం అధికారులు క్షేత్రస్థాయిలో వారి సలహాలు సూచనలు అందజేస్తూ దిగుబడులు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఇక పంటలు నష్టపోతే ఏ సీజన్‌కు సంబంధించిన పరిహారం ఆ సీజన్‌లో అందజేసి జగనన్న కొత్త సంప్రదాయానికి తెరదీశారన్నారు. ఇప్పటివరకు మండలంలోని 24 గ్రామాల్లో 202 మంది 167 ఎకరాల్లో భూములను సాగు చేసుకుంటున్నారని, వారికి శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేశారు. ఇందులో ఎస్సీలు 43 మంది, బీసీలు 155 మంది, ఓసీలు 4 మంది ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్రసేవ ద్వారా వరికోత మిషన్లు, ట్రాక్టర్‌లు, వ్యవసాయానికి అవసరమైన యంత్రాలను సబ్సిడీ ద్వారా రైతులకు అందజేస్తుందన్నారు. అనంతరం రైతులకు రుణవిముక్తి పత్రాలు, సంపూర్ణ భూహక్కు పత్రాలను సబ్‌కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేశారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సర్వేపై రేపు ప్రత్యేక సమావేశం

కౌతాళం: కులగణన సర్వేపై మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని సూచించారు. ప్రతి సచివాలయం నుంచి ఒక వలంటీర్‌కు శిక్షణ ఉంటుందని, సచివాలయంలో యాక్టివ్‌గా ఉండే ఒక వలంటీర్‌ను ఎంపిక చేసి సమావేశానికి తీసుకురావాలని చెప్పారు. ఇందుకు అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసరు హేమంత్‌కుమార్ రానున్నారని పేర్కొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

కౌతాళం: మండలంలోని సుళేకేరి గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్ సభ్యులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకుడు ప్రదీప్ రెడ్డి ఆదివారం క్రికెట్ కిట్‌ను అందజేశారు. గ్రామ, సంఘం యువకులు ఉన్నారు.

కేసు నమోదు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన అన్నదమ్ములైన చిన్నమారెప్ప, పెద్దమారెప్ప పొలం గట్టు విషయంలో గొడవపడ్డారని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య ఆదివారం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆదోనిరూరల్: మండలంలోని నెట్టేకల్ గ్రామంలో గొల్ల ఎర్రిస్వామి(50) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి ఆదివారం తెలిపారు. వివరాలు.. దొడ్డనగేరి గ్రామానికి చెందిన గొల్ల ఎర్రిస్వామి రెండేళ్ల క్రితం దాయాదులతో గొడవపడి నెట్టేకల్ గ్రామంలో మెట్టినింట్లో ఉన్న కుమార్తె మమత వద్దకు వచ్చాడు. మృతుడికి పోలియో కారణంగా కుడి చేయి పనిచేయదు. తాను అవిటితనంతో పని చేయలేనని, కుమార్తె కుటుంబానికి భారం కాకూడదని ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

టీబీ డ్యాంలో 13 టీఎంసీల నీటి నిల్వ

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో 1592.50 అడుగుల వద్ద 13 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 91 టీఎంసీల నీరు నిల్వ ఉండేవి. ఈ ఏడాది వర్షాభావం కారణంగా అతి తక్కువ నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇక ఇన్‌ఫ్లో కేవలం 933 క్యూసెక్కులుండి ఔట్‌ఫ్లో 1,929 క్యూసెక్కులుంది. టీబీ డ్యాం నుంచి కర్నూలు జిల్లాలో ప్రవహించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 680 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

హిందూ సంప్రదాయాలను పాటించాలి



బాలకొండప్పను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: ప్రతిఒక్కరూ హిందూ సంప్రదాయాలను పాటించాలని, హిందువుల ఐక్యమత్యంతో మెలగాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, సభ్యులు విట్టా రమేష్, ప్రకాష్ జైన్ అన్నారు. ఆదివారం స్థానిక పాండురంగ భావసార కల్యాణ మండపంలో విరాట్ హిందూస్థాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో హిందూ కార్తీక మహోత్సవ వనభోజనం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ జిల్లాధ్యక్షుడు, నాయకులు బసవన్నగౌడ్, విట్టా రమేష్, ప్రకాష్‌జైన్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం సభ్యులు గరుడాద్రి దత్తాత్రేయశర్మ, అశోక్, ఎండి బసవరాజుస్వామి, లోకేష్, దస్తగిరి, ఈరన్న, మనోహర్‌శెట్టి, మలేకర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం





కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతులు, కరపత్రాలను విడుదల చేస్తున్న ప్యానల్ అడ్వకేట్స్

కోసిగి: మండల కేంద్రంలో సెక్రైడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల నుంచి దివ్యాంగులు తరలివచ్చి స్థానిక వైఎస్సార్ సర్కిల్ లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సర్కిల్ నుంచి శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సెక్రైడ్ సంస్థ డైరెక్టర్ సిసి తిప్పన్న, ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య మాట్లాడుతూ వికలత్వం మనిషికే కానీ మనసుకు కాదని,పట్టుదల, కృషితో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. సెక్రైడ్ సీఓ రామాంజనేయులు, పెద్దయ్య, హనుమంతు, తాయన్న పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: దివ్యాంగులను చిన్నచూపు చూడరాదని ఆదోని బార్ అసోసియేషన్ ప్యానల్ అడ్వకేట్స్ సి.ఆనంద్, ఎంవి.లోకేష్‌కుమార్ అన్నారు. ఆదివారం రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్యానల్ అడ్వకేట్స్‌తో కలిసి ఆదోని రెండో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్యానల్ అడ్వకేట్ ఎం.విశ్వనాథ్, సీనియర్ న్యాయవాది హెచ్.శివకుమార పాల్గొన్నారు.

వాల్మీకులు ఐక్యంగా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: వాల్మీకుల సమస్యల పరిష్కారానికి ఐక్యతతో కృషి చేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీప్రసాద్, ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య సూచించారు. ఆదివారం పట్టణంలోని గ్లోబల్ ఇండస్ స్కూల్లో వాల్మీకుల కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వాహకులు బంగారు వెంకటేష్, కొండయ్య, రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ భవానీప్రసాద్, డీఎస్పీ వెంకటరామయ్య, ఆర్థోపెడిక్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ రేఖ హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అతిథులు మాట్లాడుతూ వాల్మీకుల చిరకాల కోరిక ఎస్టీ రిజర్వేషన్ సాధించుకోవడమేనని చెప్పారు. అందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. వాల్మీకి పెద్దలు గిడ్డయ్య, జయరాం, విజయకుమార్, జ్ఞానేశ్వరమ్మ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో కార్తీక మాస పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో కార్తీక మాసంలో భాగంగా ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజా, నివేదన, నీరాజన మొదలైన ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్‌మూర్తులకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే గాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే సంతాన లక్ష్మిగా వెలుగొందుతున్న మాత మాళమ్మను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీతో పాటు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.